
# "న్యాయానికి కళ్ళు వచ్చె"



కుమారి 'భ్రమర'

"ఏరా యం.ఏ. సీటుకోసం అప్లై చేశావా?" అనడిగారు జగన్నాథంగారు.

"ఇంక చదవ దలుచుకోలేదు నాన్నా" అన్నాడు మెల్లిగా మోహన్.

ఒక్క క్షణం ఆశ్చర్యపోయి తర్వాత తేరుకుని ఏంచేద్దామనుకున్నావురా మరి? నువ్వు గుమాస్తాగిరీ చేయకపోతే ఇల్లు గడవదనుకున్నావా? లేక పోతే పెళ్ళిచేసుకుని పిల్లల్ని కంటూ కూర్చుందామనుకున్నావా? స్వరం హెచ్చించి కాస్త కోపంగా అడిగారు జగన్నాథంగారు.

ఏమీ మాట్లాడకుండా తలొంచుకొని కూర్చున్నాడు మోహన్

భర్త కేకలకు వంటచేసుకుంటున్న పార్వతమ్మ గారు బయటికివచ్చి "ఏమిటండీ అలా కేకలేస్తున్నారు?" అనడిగింది.

"చూడు నీ కొడుకు ఇంక చదవనంటున్నాడు. గోళ్ళుగిల్లుకుంటూ ఇంట్లో కూర్చుంటాడుట. ఒక్కడే కొడుకుగదా వాణ్ణి పెద్ద చదువులు చదివించాలని ఎన్నో కలలు కన్నాను. అయినా నామాట వినేదెవరు. ఇంక చదవద్దంటే పట్టుబట్టి పట్నంలో కాలేజీలో చేరిందది. అంతా నాఖర్మ" అంటూ లేచి బయటికి వెళ్ళిపోయారు జగన్నాథంగారు

"అమ్మా నాకింక చదవాలని లేదమ్మా. ఎందుకు చదవవు? అంటే చెప్పలేనుకాని ముందుకు మాత్రం చదవను" ఖచ్చితంగా చెప్పేశాడు మోహన్ తల్లితో.

ఆవిడకు నవ్వువచ్చింది. యస్.యస్.యల్.సి. తోటే ఇంక చదివించనంటే మారాముచేసి, నిరాహారదీక్షను చేసి తనపట్టు నెగ్గించుకుని హాస్టల్‌లో వుండి ఇప్పుడు బి. ఏ. మొదటి సంవత్సరం చదువుతున్న కూతురు జలజ గుర్తుకువచ్చింది.

ఏవిటో ఆడపిల్ల పట్టుబట్టి చదువుతూవుంటే వీడేమో చదవనంటున్నాడు. "సరే నీ ఇష్టం" అంటూ లోపలికి వెళ్ళిపోయిందావిడ.

మోహన్ ది డైరీ ఆఫ్ ది షేడ్ మేన్ చదువుకుంటూ కూర్చున్నాడు మామూలుగా. అతని చదువు విషయం అతన్నేమాత్రం బాధించటంలేదు. కాని తన చదువు గురించి తండ్రి ఎందుకంత బాధ పడుతున్నాడో అర్థంకాలేదతనికి

12 గంటలకు తిరిగి వచ్చారు బయటకు వెళ్ళిన జగన్నాథంగారు.

"కాళ్ళు కడుక్కురండి ఇద్దరికీ వడ్డించేస్తాను." అంది పార్వతమ్మగారు.

తండ్రీ కొడుకులిద్దరూ మౌనంగా భోంచేస్తున్నారు. ఉన్నట్టుండి "ఆ మాధవరావు కొడుకు ఎం. ఏ. చదువుతానంటే డబ్బులేక యింక చదివించనన్నాడుట. వాడేమో ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నాడుట. ఆ వెంకటేశం అంతే కొడుకును చదివించలేక పోయానని తెగ బాధపడి పోతున్నాడు. పోనీ అప్పిస్తాను చదివించవయ్యా అంటే తీర్చలేనేమో? పెద్ద చదువులు చదివిన తర్వాత వాడెలా మారిపోతాడో ఎవరు చెప్పగలరు బాబూ అంటాడు. ఏమిటో లేనివాళ్ళలా ఏడుస్తుంటే అన్నీ వున్న మన ప్రబుద్ధుడు యిలా మొరాయించాడు. అంతా నా ఖర్మలే" అన్నారు జగన్నాథంగారు. చేతిలో ముద్ద పట్టుకునే.

"సరే ముందు అన్నం తినండి. తర్వాత తీరిగ్గా అందరి గొడవా మాట్లాడుకోవచ్చు." హెచ్చరించింది పార్వతమ్మగారు.

తండ్రి మాటలకు మోహన్ నవ్వుకున్నాడు లోలోపల.

ఇద్దరూ భోజనం చేసి చెయ్యికడుక్కుని ఎవరి గదుల్లోకి వారెళ్ళిపోయారు. మోహన్ నవల తీసుకూర్చున్నాడు. చదవబుద్ధికాక నవల ప్రక్కన పెట్టి నాన్నగారు ఆ మాధవరావు కొడుక్కు సహాయం చేస్తే ఎంత బాగుండును. రమేష్ కూడా ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. బి. ఏ. కూడా అతి కష్టంమీద చదివించాడు కొడుకుని. వాడు బుద్ధిమంతుడు కనుక పరిస్థితులు అర్థంచేసుకుని అందరిలాగా లేనిపోని పిచ్చిమెట్టి వేషాలు వెయ్యకుండా కష్టపడి చదివి క్లాసు తెచ్చుకున్నాడు. నాతో ఎన్నోసార్లు యమ్. ఏ. చదవాలని వుందిరా. కాని ఎలాగా? అని ఆలోచిస్తున్నాడు. ఏదో ఆలోచన తట్టింది మోహన్‌కు. వెంటనే లేచి నెమ్మదిగా తండ్రి గదిలోకి వెళ్ళాడు.

"నాన్నగారూ" పిలిచాడు నెమ్మదిగా.

"ఏరా?" గంభీరంగా వుంది జగన్నాథంగారి గొంతు.

"నే చదవలేదని మీరు బాధపడి లాభం లేదు నాన్నగారూ. మీ రెంత బలవంతం చేసినా నే చదవదలుచుకోలేదు. నా బదులు ఆ రమేషును అదే ఆ మాధవరావుగారబ్బాయిని చదివించండి నాన్నగారూ. అతని చదువుకు కావలసిన డబ్బు అప్పుగానే ఇవ్వండి. వాడు తీర్చగలిగినపుడే తీసుకుందాం. ఎలాగూ మన రుణం వాళ్ళుంచుకోరు. ఈ ఒక్క సహాయం చెయ్యండి నాన్నగారూ!" బ్రతిమాలుతున్న ధోరణిలో అడిగాడు మోహన్.

తోక త్రొక్కిన త్రాచులా బుసకొట్టారు జగన్నాథంగారు.

"నువ్వు చదవలేక ఇంకొకణ్ణి చదివించమని సిఫారసు చేస్తున్నావా? అడ్డమైనవాళ్ళను చదివించడానికి నాకేంపట్టిందిరా? ఊళ్ళోవాళ్ళందరిని ఉద్ధరించడానికి సంపాదించా ననుకున్నావా ఈ ఆస్తంతాను" అంటూ కస్సుమన్నారు.

అయినా జంకలేదు మోహన్.

"నాన్నగారూ. కోపగించుకోకండి. కాస్త నిదానంగా ఆలోచించండి. నేను వూరికే చదివించమనటంలేదుగా. అప్పుగా ఇవ్వమంటున్నాను. అప్పు తీర్చలేడేమోనని అనుకోకండి. రమేష్ చాల అభిమానవంతుడు. ఎప్పటికైనా మన అప్పు తీరుస్తాడు. ఈ ఒక్క సహాయం చెయ్యండి నాన్నగారూ" అన్నాడు మోహన్.

కాస్త మెత్తబడినట్టున్నారు జగన్నాథంగారు. "సరే అలాగేలే. ఒకసారి ఆ మాధవరావు నొచ్చి నాతో మాట్లాడమని చెప్పు" అన్నాడు.

తండ్రి తత్వం బాగా తెలుసు కనుక తండ్రి, ఎన్ని తిట్టినా, కేక లేసినా బాధపడడు మోహన్. మొదట 'కయ్'మని కోప్పడి తర్వాత మెల్లిమెల్లిగా పాలపొంగులా అణగారిపోతుందాయన కోపం.

అందుకే తండ్రిని చూసి గర్వపడుతూ వుంటాడు మోహన్ అప్పుడప్పుడు.

రమేష్‌ను తిరుపతిలో ఎమ్. ఏ. చదవడానికి పంపించారు జగన్నాథంగారు. అప్పుగా మాత్రం ఇవ్వలేదాయన అతని చదువుకు డబ్బును. మాధవరావుగారితో అన్నారు. "చూడవయ్యా! మీ అబ్బాయి అయినా. మావాడైనా నా కొకటే. ఎలాగో మావాణ్ణి చదివించాలనుకున్నాను. ఆ డబ్బుతో మీ అబ్బాయిని చదివించు" అన్నారు జగన్నాథంగారు.

ఊళ్ళో వాళ్ళంతా ఆశ్చర్యంగా చెప్పుకున్నారీ మాటను. కొంతమంది ఆయన ఔదార్యాన్ని మెచ్చుకుంటే కొంతమంది ఈర్ష్యపడ్డారు.

"ఏమండీ! మీ అబ్బాయిని ముందుకు చదివించలే దెందుకు?" అని అడిగేవారు. ఆమాట వినేప్పటికి జగన్నాథంగారికి ఒళ్ళు మండిపోయేది. ఏదో సమాధానంచెప్పి ఆ కోపంతో ఇంటికొచ్చి భార్యను, కొడుకును నాలుగు దులిపేవాడు.

వాళ్ళుకూడా ఆయన తిట్లను వెంటనే దులిపేసుకోవడం అలవాటు చేసుకున్నారు.

పొద్దున్న 6½ అయివుంటుంది. వీధి అరుగు మీద నిలబడి కాఫీ త్రాగుతున్నాడు మోహన్.

"అయ్యగారూ పెద్దయ్యగారు లేరా?" అంటూ వచ్చాడు కొత్తమీర.

"పూజ చేసుకుంటున్నారు. ఎందుకురా?" అడిగాడు మోహన్.

"నిన్న మాపుసరి కూలోళ్ళకి చెప్పమని చెప్పిండారు. పద్దెదుమందికి చెప్పిండాను. ఎల్లయ్య ఆళ్ళను చేనికి తోలుకుపోనాడు. అయ్యగారికీమాట చెప్పిపోదామని వచ్చాను." అన్నాడు వాడు.

"ఏం పనిచేస్తున్నారురా పొలంలో?" అడిగాడు మోహన్.

"అదే అయ్యా, వంకదిక్కు చేలన్నీ లెవలు సేయిత్తా నన్నారు."

"సరే నడు నేవస్తానివాళ నీతో" అన్నాడు.

"ఇంత పొద్దుగాలకే మీరెందుకు బాబూ, బువ్వ తిన్నాకరండి. మేం పని చెస్తావుంటాము" అన్నాడు కొత్తమీర.

"పరవాలేదులే పదవరా" అంటు కాఫీగ్లాసు ఇంట్లో పెట్టి. టవలొకటి భుజాన వేసుకొని అమ్మా నేనలా పొలం వెళ్ళి వస్తాను. ఇవాళ నాన్నగారిని రావద్దనిచెప్పు" అంటూ కొత్తమీరితో బయలుదేరాడు మోహన్.

ఎఱ్ఱమట్టి పొలాలెక్కువ. పచ్చదనం తక్కువ. కాలిబాటంతా దుమ్ముకొట్టుకు పోయింది. బోదె కాలువలున్నాయి గాని వాటిల్లో నీళ్ళులేవు. ఎక్కడ చూసినా ఈతచెట్లే. వయస్సుమళ్ళిన బాడవటం వల్ల కొత్తమీరి కాస్త నిదానంగా నడుస్తున్నాడు. ఆలోచిస్తూ అతనివెనకనే నడుస్తున్నాడు మోహన్.

ఇదే గోదావరి జిల్లాలో అయితే అన్నిప్రక్కల పచ్చదనంతో కళకళలాడుతూ నయనానందకరంగా వుంటాయి. ఎటుచూసినా అరటి. కొబ్బరి. మామిడి మొదలైన చెట్లు దర్శనమిస్తాయి. ఇక్కడ మచ్చుకైనా ఒక్క తాటిగాని: కొబ్బరిచెట్టుగాని. కనబడదు. తుంగభద్ర కాలువచ్చింతర్వాతైన ఇక్కడ ఇంతమాత్రం వరి అయినా పండుతుంది.



పది పన్నెండేళ్ళకితం వరికూడ గగన కుసుమంగా వుండేది. ఎటుచూసినా జొన్న, పత్తిచేలు, కోసినవి కొన్ని కోయనవి కొన్ని.

"అయ్యగారు ఇదుగో ఈచేను పెద్దయ్యగారు తీసుకుందామను కుంటున్నారు." అన్నాడు కొత్తమీరి వెంకన్న తిరిగి పక్కనున్న చేనుచూపించి.

"ఏం బాగా పండుతున్నదేనిటి: చౌకగా వస్తోందా! ప్రశ్నించాడు మోహన్.

"అరెకరాలు ఒకటే చెక్కగా వుందయ్యా. బలంఛేస్తే "బుడ్డ" బేషుగా పండుతుంది. తీసుకుంటే బాగుంటుందమ్మా" అన్నాడు కొత్తమీరి.

బుడ్డ అనేమాటకు నవ్వు వచ్చింది మోహన్‌కు రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో వేరుశనగ కాయలకు బుడ్డ అంటారు.

తుంగభద్ర కాలువ వచ్చిన తర్వాత జగన్నాధం గారు గోదావరి జిల్లానుండి వచ్చి కర్నూలు జిల్లాలో కొంత వరిభూమి మెట్టభూమి కొన్నారు.

"ఒక్కసారి ఈచేను చూసొద్దాం" అంటూ ఆ చేలోకి దారితీశాడు. కొత్తమీరి. "మొన్ననే బుడ్లు కితెన్నారు. మనం తీసుకుంటే మళ్ళా బుడ్లే వెయ్యాల" అన్నాడు మళ్ళా.

"ఎందుకు అమ్ముతున్నారురా. బాగా పండే చేన్ను! అసలెవరిదా చేను?" అడిగాడు మోహన్.

"అదే బాబూ ఆనాగరాజు అయ్యది. ఈచేనమ్మి వరిచేను కొంటాకంట" అన్నాడు.

"సరే బాలపొద్దెక్కుతోంది తొందరగా పదు అక్కడ వాళ్ళేంపని చేస్తున్నారో ఏమో" అను కుంటూ వాళ్ళపొలంవైపు నడవసాగారిద్దరూ.

నడుస్తున్న వాడికల్లా కొత్తమేరి గడివిచూసి బాడిపేకనుచూసి నవ్వువచ్చింది మోహన్‌కు. ఇదేమిటి 'కొత్తమేరి' వాడిపేరు ఎలాపెట్టారు ఏమీఅను కుంటూ వుండబట్టలేక "ఒరే నీ అసలు పేరేకొత్తమేరిబరా?" అడిగాడు.

"అదంతా ఓకథలేవయ్య చెప్పమంటె చెప్తాను" అన్నాడు.

"చెప్పరా మనపొలం ఇంకాచాలదూరముందలే" అన్నాడు మోహన్.

నా అసలుపేరు వరసప్ప. మాము అప్పుడు అంటే నాసిన్నప్పటినుండి, మావాళ్ళంతా కొత్తమేరి, ధనియాలు అమ్ముకొని బాగా సంపాదించారంట. అప్పుడుమాచేలనిండా కొత్తమేరే వుండేది. మావోళ్ళు ఆపంటతప్ప ఏరే యేమీ ఏసేవారు కాదంట. మా అబ్బకూడ దాన సంపాదించాడు.

దాలమందికి అప్పులిచ్చినాడు కాని అయ్యతిరిగియ్యలేదెవ్వరూ. నాకు ఇద్దరక్కలుండేవారు. వాళ్ళకి లగ్నం చేసి మా అప్ప చచ్చిపోనాడు. నా చేతికొచ్చేటప్పటికి చేలల్లో సారమంతాపోనాది. మా అమ్మ దిగులే తీరిపోయింది. నాకప్పటికే పెళ్ళయింది. పంట తగ్గినా చాల రోజుల కొత్తమేరి యాపారమే చేసినాను. మా అప్ప మిగిల్చిన డబ్బు కొంత వుంటే అదికూడా చేలకె పెట్టినాను. అయినా రాబడి తగ్గిపోయింది. ఊళ్లో పెద్దలంతా చెపితే నా కొడుకును పెద్ద సదువు సదివించినాను. ఆస్తి అంతా కరిగిపోయింది. కోనాకి చేలన్నీ అమ్మేసి కూలి చేసుకోడం మొదలుపెట్టాను. అప్పుడే నా భార్య కూడ పోయింది. అదికేమో బొంబాయిలో ఓడలరేవులో పెద్ద అఫీసరుగా నౌకరీ వచ్చింది. ఉద్యోగంలో చేరిన తర్వాత ఇల్లూ అది చూసి నిన్నుకూడా తీసుకుపోతానని చెప్పి అదుబొంబాయి పోయి మరల తిరిగి రాలేదు.

పెద్ద బంగళా. కారు అఫీసువాళ్ళే ఇచ్చారు. నన్ను రమ్మని రెండు మూడు దఫాలు జాబు రాసినాడు, ఆ డొచ్చి పిలుచుకుపోక నాకు నేనే ఎందుకు పోవాలని నే పోలేదు. రేక్కాడితేనంతనేపు పరవా లేదు. వాడు పెద్దఆఫీసరయినాడు నాకదే సంతోషం అయ్యా" అన్నాడు.

"నీ కొడుకు బొంబాయిలో అఫీసరుగా వున్నాడా!" ఆశ్చర్యంగా అడిగాడు మోహన్.

"అవునయ్యా. అదేమో ఆఫీసరు, నేనేమో కూలోడిని. అయినా వూళ్ళోవాళ్ళందరికీ నేనంటే అభిమానం. కొత్తమీర వ్యాపారం చేసినందుకు నా అసలుపేరు మరుగన పడిపోయి నన్నే కొత్తమీర అని పిలుస్తారు. పేరుకు కాదు బాబూ ఇలువ అసలు మడిసికుండాల అందుకే ఏమని పిలిచినా నేనేమనేవోణ్ణికాదు. అదే కొత్తమేరి నా అసలు పేరయిపోయింది" అని ఒక నిట్టూర్పు విడిచాడు.

పొలం దగ్గరకొచ్చారు గునపాలతోమన్నుతవ్వి గోతులలో చెరు చదును చేస్తున్నారు కూలీలు. అప్పటికి 8½ అయింది. కూలీలు ఆరు గంటలకే తప్ప మధ్యాహ్నం ఒంటిగంట దాకా పనిచేస్తారు.

పదకొండు గంటలకు వాళ్లు తెచ్చుకున్న అన్నం, రొట్టెలు అందరికీ కలిపి ఒక పెద్ద గుడ్డ మీదవేసి ఎవరికి కావలసినంత వాళ్లు తింటున్నారు. ఆక మగ. పెద్ద చిన్న అనే బేధం లేకుండా తిని నీళ్ల త్రాగుతారు. వాళ్ళ ఐక్యత మోహన్ను ముగ్ధుణ్ని చేసింది. "కో ఆపరేషన్" అంటే ఏమిటో వీళ్ళనుచూస్తే బాగా తెలుస్తుంది అను కున్నాడు.

వాళ్ల పనిచేస్తుంటే ఎల్లయ్యను వెంట బెట్టుకుని పొలమంతా ఒకసారి తిరిగివచ్చి వాటి గురించి వివరా లడిగాడు.

"ఇవి వంక చేలు అది జమ్మిచెట్టు చేను. ఆ గుడిసెలవైపు చేలు నీరెక్కడం కొంచెం కష్టం వంక చేలకు మాత్రం కాలవ నీరంత అవసరం లేదు" అంటూ చెప్పుకు పోతున్నాడు ఎల్లయ్య.

కూలీలు సరిగా పనిచేస్తున్నారో లేదో చూచు కోవడం మాత్రమే కొత్తమేరి పని. వాడు పని చేయలేడు. అందుచేత అజమాయిషీ చేస్తుంటాడు.

మోహన్ రోజూ రెగ్యులర్‌గా పొలంవెళ్ళి పనులన్నీ చేయిస్తున్నాడు. జగన్నాధంగారు అప్పుడప్పుడు వెళ్ళి చూసేవారు.

పొద్దస్తమానూ కూలి వాళ్ళతోను, మిగిలిన రైతులతోను, లేకపోతే, ఏ చేలో ఏం వెయ్యాలో వేటికి ఎప్పుడు ఏయెన్యూర్స్ వెయ్యాల్ అలోచిస్తూ ఎల్లయ్యతోను, తండ్రితోను సంప్రదిస్తుండే వాడు. ఏదో ఎడ్లజత ముసలిదయి పోయిందన్నారు "కొత్తమీరి" అని అమ్మేసి వేరే కొందామంటే ముసలి వాటిని అమ్మడం యెందుకని వేరే ఇంకోక జత ఎడ్లు కొన్నారు జగన్నాధంగారు.

ఇన్ని సంవత్సరాల నుంచీ వ్యవసాయం చేస్తున్న ఒక బండైనా లేదని తండ్రిని అడిగి ఒక బండికి ఆర్డరిచ్చాడు. ఇరవైనాలుగు గంటలూ ఆ గొడవలోనే మునిగి వుండేవాడు మోహన్.

వేళాపాళా లేకుండా ఎండనబడి తిరిగి ఎలా మాడిపోయాడో చూడండనేది భర్తతో పార్వతమ్మ గారూ.

"నేనేం తిరగమన్నానా వాణ్ణి. పోనీలేరా బాబూ ఇక చదువు మానేసి పొలాలు చూసుకోమని చెప్పానా! వాడే ఇష్టపడి చేస్తుంటే మధ్య నువ్వే నన్నంటావు కదే! అంతా నా ఖర్మ" అంటూ వుండేవారు జగన్నాథం గారు.

నాగరాజుగారి అరెకరాల పొలం కొన్నారు జగన్నాధంగారు. మోహన్ అధ్వర్యంలో ఆ చేలో వేరుసెనగ వేశారు. మంచి మెన్యూర్స్. పెంటవేసి బాగా బలం చేశారు. పెట్టుబడికి రెట్టింపువంట చేతి కొచ్చిం దాయేడు.

నాగరాజు ఆ వూరి కో-ఆపరేటివ్‌సొసైటీ ప్రెసిడెంటు. కాస్త మోతుబరి. తన దగ్గర వున్నప్పుడు పెట్టుబడి రావడానికే గగనమయ్యేచేను జగన్నాథం గారి హస్తగతం అయ్యేటప్పటికి రెట్టింపు రాబడివ్వడంచూసి నాగరాజుకు కంటగింపయింది. అందులోను మోహన్ యువకుడు. చదువుకొన్నవాడు ఊళ్లో వున్న రైతులకు సలహాలిస్తుండేవాడు. అతనిచ్చిన సలహాలు వాళ్ళ కుపయోగపడేటప్పటికి మోహన్‌కా వూళ్ళో మంచి పేరు వచ్చింది.

నాగరాజుగారితో పనిపడితే వెళ్ళి మాట్లాడివచ్చే

# "వినయ సాహితీ సమితి" ఇన్లాండ్ కవర్ కథల పోటీ!

యువ రచయితలను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో "వినయ సాహితీసమితి" చిన్న కథల పోటీని నిర్వహిస్తోంది. కథను ఇన్లాండ్ కవర్ మీద మాత్రమే విడి విడి అక్షరాలతో రాసి పంపాలి. మొదటి బహుమతి రు. 50 రెండవ బహుమతి రు. 30, మూడవ బహుమతి రు. 20 ఇవ్వబడును. బహుమతి పొందిన కథలు సెప్టెంబరు నెలలో ఒక ప్రముఖ మాసపత్రికలో ప్రచురింప బడును. ఉత్తమమైన 25 కథలకు పుస్తకరూపం.

పోటీకి ప్రవేశరుసుము ఒక రూపాయి మాత్రమే; పోటీలో పాల్గొనువారు తమ ఇన్లాండ్ కవర్, కథలను 1970 ఆగస్టు 15 వ తేదీలోగా– చొక్కాపు వెంకటరమణ, వినయ సాహితీ సమితి, వించిపేట, విజయవాడ–1 చిరునామాకు పంపాలి.

వాడు మోహన్. సొసైటీకి వచ్చే మెమ్యూర్స్ గురించి,వాటిని రైతులకు లోను ఇచ్చే విషయాలు అన్నీ మాట్లాడి వచ్చేవాడు.

అప్పటికే నాగరాజు గురించి కొన్ని వదంతులు విన్నాడు మోహన్. అతను రైతుల నే విధంగా పీడించేది, లోను తీసుకుంటే గడువు పూర్తికాక ముందే దౌర్జన్యంగా వసూలు చేసేది, పంచదార కోటా వచ్చిన వారం రోజులదాకా ఇంకా రాలేదని స్టోర్సుకు వచ్చిన వాళ్ళను తిప్పి పంపడం మొదలైనవి.

ఒకసారి ఎదురింటివాళ్ళ అబ్బాయి మోహన్ దగ్గరకొచ్చి "ఏమండీ! ఇవాళ మధ్యాహ్నం స్టోరుకు చక్కెరకు పోయానండి. చక్కెర తడిగాను, ముద్దగానూ వుంటే నే నొద్దన్నానండి. నాగరాజు గారక్కడే వున్నారండి ఇవాళ లారీవస్తుంటే దారిలో కొద్దిగా వానపడిందట దోవలో. అందుకే బస్తాలు కొంచెం తడిశాయి అన్నారు.

"ఈ పొద్దు నిన్న అసలు వానే రాలేదుగదా? పట్నానికి ఇక్కడకు దూరం కూడ ఎక్కువలేదు. బస్తాలు వానకే తడిశాయో లేక బరువెక్కువవుతుందని చింతపండు, మిరపకాయలకు మల్లే ఈ బస్తాలుకూడ మీరే తడిపారో' అన్నాను తమాషాకి. బలే కోపమొచ్చింది నాగరాజుగారికి. 'ఏరా ఒళ్ళు కొవ్వెక్కిందా లేకపోతే ఆ మోహన్‌గా దేమైనా చెప్పిపంపేడా?' అన్నారండి. నేనుకూడ కోపంగా 'నాకు మీ చక్కెర అక్కర్లే' దంటూ తిరిగొచ్చేశాను" అన్నాడు.

ఆ అబ్బాయి మాటలకు మోహన్‌కు బలేనవ్వొచ్చింది. పాపం! పంచదార బస్తాలు మీదకూడా నీళ్ల చల్లారా? అని అడిగాడుట. నవ్వుతూ.

"చూడు రామం పంచదారబస్తా తడిపిఅమ్మితే లాభమా నష్టమా?" అన్నాడు మోహన్ ఆ అబ్బాయి మొహంలో కి చూస్తూ.

వాడికి పదమూడేళ్ళుంటాయి. ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు. ఏమైనా తెలియకపోతే మోహన్ దగ్గరకు వెళ్ళి చెప్పించుకుంటాడు.

మోహన్ మాటలకు వెంటనే "అదేమిటండీ అట్లాగంటారు. చక్కెర తడిసిపోతే నీళ్లకారిపోను టండి. అయినా నిజంగా తడిపారో లేదోగాని నేను మాత్రంతమాషాగాఅంటే మండిపడ్డారు." అన్నాడు అమాయకంగా మొహంపెట్టి.

"సరేగాని ఇంకెప్పుడు ఆయనతో అలా మాట్లాడొద్దు." అని చెప్పాడు మోహన్.

"అలాగే నంటూ" వెళ్ళిపోయాడు రామం.

* * *


కాలువ నిండుగా నీరుంది. చెరువు లున్నవాళ్ల ముందుగానే ఆకుమళ్ళు వేసుకున్నారు. లేనివాళ్ళు కాలవరాగానే వే స్తున్నారు. జగన్నాథంగారి ఆకు అప్పుడే పెరిగింది.

ఊడ్పుల రోజులు కూలీలే దొరకడంలేదు. చాల మట్టుకు ఊడ్పు అయిపోయింది. అయిదెకరాలు మాత్రం మిగిలిపోయింది. ఆకు తక్కువయినందున ప్రక్కవూరుకు వెళ్ళి ఆకు కొనుక్కురావలసి వచ్చింది జగన్నాథంగారికి.

ముందురోజే కూలీలకు చెప్పి వుంచారు. ఆకు తేవడం ఆలస్యమయింది. సమయం చూసి ఆ కూలీలందరినీ తన చేనుకు తీసుపోయాడు నాగరాజు

ఆకు వేసుకొచ్చేప్పటికి తొమ్మిదయింది. కూలీలంతా నాగరాజు పనిలోకివెళ్ళారనేప్పటికి మోహన్ మనస్సు చివుక్కు మంది. చేసేదేమీ లేక మర్నాటికి జాగ్రత్తచేశారు ఆకును.

జగన్నాథంగారి జమ్మిచెట్టుచేను ప్రక్కనే నాగరాజు చేనుకూడా ఉంది.




మర్నాటికి కూలీలను మాట్లాడి ఇంటికివచ్చాడు మోహన్.

మధ్యాహ్నం రెండయి వుంటుంది. తిరిగి తిరిగి వచ్చాడేమో అలసటగారెండుచేతుల్లో తల పట్టుకొని మంచంమీద కూర్చున్నాడు.

"లేవరా కాళ్ల కడుక్కురా అన్నానికి" అంది తల్లి.

"అబ్బా! చాల చికాకుగావుంది నీళ్ళుపోసుకోవాలమ్మా" అన్నాడు.

"ఎండవేళ ఇప్పుడు నీరేమిటిరా? కాళ్లు కడుక్కురా. కొంత చల్లబడ్డాక స్నానం చేద్దువుగానిలే" అంది.

"సరే" అంటూలేచి కాళ్ళూ, చేతులూ కడుక్కుని భోజనంచేశాడు.

ఇవిగో ఉత్తరాలొచ్చాయి అంటూ కొడుకుచేతి కందించారు, జగన్నాథంగారు. అందులో ఒకటి జలజరాసింది. దానికెప్పుడూ చదువుగొడవ తప్పితే వేరే ఏమీ వుండదు. కాలేజీల్లో చదివే ఆడపిల్లల్లో నిజంగా చదువుకోసం చదివే వాళ్ళెంత మంది? ఏదో సరదాకో, హాబీకో, గొప్పకో చదువుతూ వుంటారు. అలాంటిది జలజపూర్తిగా చదువుకోసం చదువుతుంది. దాని చదువుతో ఎవరికీ పనిలేదు. అయినా అది దాని వుత్సాహం, పట్టుదలకు నిదర్శనం. బలే తెలివైన అల్లరిపిల్ల అని నవ్వుకున్నాడు.

రెండో ఉత్తరం రమేష్‌రాసింది. అతనిదగ్గర్నుండి ఎప్పుడు వుత్తరం వచ్చినా దాని నిండా కృతజ్ఞతలు తప్పితే వేరే సంగతులే వుండవు. అతని ఉత్తరాలు చదవాలంటేనే విసుగు మోహన్‌కు, ఉత్తరాలు మడిచిపెట్టి డ్రాయర్లోంచి రెండు ఇన్లాండు లెటర్సు తీసి ఇద్దరికి చెరొకటిరాసి పోస్టు చేయించాడు.

మర్నాడు అనుకున్న ప్రకారం ఊడ్పుఅయిపోయింది. సాయంత్రం నాలుగు గంటలకు కూలీలకు కూలిఇస్తున్నారు. అరుగుమీద కూర్చుని మోహన్.మాటల సందర్భంలో మొన్న మామూలు కూలికంటే నాలుగణాలెక్కువ ఇచ్చినాడు ఆనాగరాజయ్య అన్నాడొకడు. నాగరాజెందుకిలా చేస్తున్నాడో అర్థంకాలేదు మోహన్‌కు.

ఏమండీ మీమోహన్ అనాగరాజుగారికి ఎదురట. ఆయనతోకాస్త జాగ్రత్తగా వుండాలండీ అనేవారు జగన్నాథంగారితో కొంతమంది.

ఊరుగాని వూరువచ్చి ఇటువంటి చోట్ల కలహాలు, కలతలు పెట్టుకుంటే చాలకష్టమని బాధపడేవారు.

ఇంటికొచ్చి మోహన్ను మందలించారు.

"నేనేం చేశాను నాన్నాగారూ? మీరుకూడనన్నే అంటారు. ఆయనే మనల్ని దెబ్బగొట్టాలని రెండు మూడు సార్లు మనకూలివాళ్ళను తీసుకువెళ్ళి తన పనిచేయించుకున్నాడు. అయినా నేనేమన లేదు"

అన్నాడు మోహన్.

అప్పటికే చేలన్నీ ఏపుగా పెరిగాయి. కొన్ని చోట్ల గింజపట్టి పాలుపోసుకుంటున్నాయి. ఆరోజు నీళ్లు కట్టుకోవలసిన వంతు మోహన్‌వాళ్ళది. రాత్రి నీళ్ళుకట్టడానికి వెళ్ళారు ఎల్లయ్య, మోహన్. మోహన్ టార్చి, ఎల్లయ్య హరికెన్ లాంతరూ. చేతిలో చిన్నగొడ్డలి పట్టుకుని బయలుదేరారు.

పొలంచేరుకుని నీళ్ళబోదె దగ్గరకు వెళ్ళారిద్దరూ వాళ్ళబోదెకు రెండుబండరాళ్ళు అడ్డంపెట్టిమధ్యలో ••చూచేశారు. నీళ్ళన్నీ నాగరాజు చేలోకి మళ్ళింప ••న్నాయి.

"ఎల్లయ్యా ఇవాళ మనవంతుకదా ! మళ్ళా వాళ్ళచేనుకే పెట్టుకున్నారేమిటి ?" అడిగాడు మోహన్.

"అందేందయ్యగారూ ఈ పొద్దు మన చేనుకేమ పర్చేరు చెప్పెపోనాడు. ఇంతరాత్రివచ్చి తిరిగి పోతామా ? ఆ నాగరాజయ్యే ఈపని చేయించుం దాల. ఆ అయ్య మనమీద కక్ష గట్టినా" డంటూ లాంతరు, గొడ్డలిగట్టుమీదపెట్టి బోదెకడ్డం పెట్టిన రాళ్ళగడ్డితీసి నగరాజు బోదెకు అడ్డువేసి తమ చేనుకు మళ్ళించాడు నీళ్ళను.

"మీరు పొండయ్యా. నేనామెట వస్తానన్నాడు" ఎల్లయ్య

"వద్దులేరా కొన్ని మళ్ళైనా తడవనీ తర్వాత ఇద్దరం కలిసే వెళదాము." అన్నాడు మోహన్.

ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి మూడయింది.

రాత్రి నిద్రలేని మూలాన మర్నాడు పదకొండు గంటలదాకా నిద్రపోయాడు మోహన్.

"ఒరే నీళ్ళ కట్టడానికి కూడా నువ్వే వెళ్ళాలి టరా ? నిద్రచెడగొట్టుకుని ఇలా తిరిగితే ఆరోగ్యం పాడయిపోదూ !" అనికేకలేశాడుజగన్నాధంగారు.

"పర్వాలేదు నాన్నగారు. రేపొక్కరోజు కడితే చాలు మళ్ళన్నీ తడిసిపోతాయి. ఇంకనీళ్ళు కట్టాలిసిన పనిలేదు" అన్నాడు మోహన్.

"ఏమోరా రాత్రిళ్ళు వెళ్ళడమంటె నాకు భయంగానే వుంది. ఆ నాగరాజు మనషులు కాగివస్తారట వాళ్ళకి మనకు నీళ్ళవంతు" అన్నాడు జగన్నాధంగారు.

ఆరోజు నాగరాజు "మోహన్ మా చేనుకు నీళ్లు కట్టుకుంటే బంద్ చేయించి తనచేనుకు పెట్టుకున్నాడని" ఊరంతా చెప్పాడుట.

ఆదేరోజు సాయంత్రం నాగరాజు మోహన్ను పిలిపించి ఇవాళ కూడ మీరే నీళ్ళుకట్టుకోండి. రేపటినుండి వరసగా మేం కట్టుకుంటాము. సర్వేరుతో కూడ ఈ విషయం చెప్తాలే" అన్నాడు.

"సరేనండి కంటిన్యూగా పెట్టుకుంటే బాగా కలుస్తుందంటూ" చెప్పివచ్చేశాడు మోహన్

ఇంటికి రాగానే ఎల్లయ్యకు కబురుచేసి విషయం చెప్పి ఇంటికి వెళ్ళి తొందరగా భోంచేసి రమ్మన్నాడు.

"అట్లాగే"నంటూ ఇంటికెళ్ళి భోంచేసి వచ్చాడు ఎల్లయ్య.

మోహన్ కూడ త్వరగా భోంచేసి టార్చి తీసుకుని. తలకు మఫ్లరు చుట్టుకుని బయలుదేరాడు.

వెళ్ళేటప్పుడు "నీళ్లు కట్టగానే వచ్చేయండిరా. రాత్రంతా కూర్చుని అక్కడేం చేస్తారు" అన్నారు జగన్నాధంగారు.

"అలాగే పెందలాడే వచ్చేస్తా"మంటూ బయలుదేరాడు.

వాళ్ళు పొలం వెళ్ళేటప్పటికి ఎనిమిదయింది. ఒక్కసారి చేనంతా తిరిగి ఏ ఏ మళ్లు తడపాలో చూసుకుని నీళ్ళు వదిలారు.

రాత్రి పదకొండయింది. "అయ్యగారూ మీరిక నడుస్తూ వుండండి. నే ఇంకొకసారి చేనంతా చూసివస్తాను. ఇదిగో ఇది తీసుకెళ్ళండని" గొడ్డలి మోహన్ చేతికిచ్చాడు. వద్దన్నా వినకుండా మోహన్ను వెళ్ళిపొమ్మన్నాడు ఎల్లయ్య జగన్నాధంగారు కోప్పడతారని.

విధిలేక అలాగేలేరా అంటూ బయలుదేరాడు మోహన్ ఒంటరిగా టార్చి. గొడ్డలితో. రెండు మూడుసార్లు వెనక్కు తిరిగిచూశాడు ఎల్లయ్య వస్తున్నాడేమోనని. చేలన్నీ తిరిగి వచ్చేటప్పటికి ఆలస్యమవుతుందెలాగైనా అనుకుని నడక వేగం హెచ్చించాడు మోహన్. ఊరి పొలిమేర దగ్గరున్న కరణంగారి జొన్న చేల ప్రక్కనున్న కాలిబాట గుండా చక చకా నడుస్తున్నాడు మోహన్.

ఇంతలో ఎవరో వెనుకనుంచి వచ్చి మెడ పట్టుకున్నారు. విదిలించుకుందామని ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఇంకొక ఇద్దరొచ్చి నోరు నొక్కిపట్టుకున్నారు. వెనుకనుండి గొడ్డలితో మోహన్ మెడమీద వచ్చి పడింది.

విద్యావంతుడు. ధనవంతుడు, యువకుడు, ఒక్కగానొక్క కొడుకు అయిన ఇరవైరెండు సంవత్సరాల మోహన్ నాగరాజు మనుషుల చేత గొడ్డలికి బలి అయిపోయాడు.

రివ్వున గాలి వీచేటప్పటికి జొన్న కంకెల బరువుకు చెట్లన్నీ ఒక్కసారి తల వంచుకున్నాయి.

ఒక్క క్షణ మాలస్యంచెయ్యకుండా మోహన్ శవాన్ని జొన్న చేలోకి ఈడ్చిపారేసి వాళ్ళు గొడ్డళ్ళతో మాయమయ్యారు.

ఇది జరిగిన అర్ధ గంటకు అదే దారిన నడిచి పోయాడింటికి ఎల్లయ్య మామూలుగా.

మర్నాడు కరణంగారి జొన్నచేలో మోహన్ శవం వుందని తెలిసేటప్పటికి పార్వతమ్మ, జగన్నాధంగార్ల పరిస్థితి చెప్పనలవి కాదు. కావలసిన వాళ్ళందరికి టెలిగ్రాము లిప్పించారు.

మోహన్ కళేబరాన్ని పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. మోహన్ శవానికి కొద్ది దూరంలో ఎల్లయ్య గొడ్డలి టార్చిపడి వున్నాయి.

కొన్నాళ్లు కేసు నడిచింది. ఫలితం ఎల్లయ్యకు యావజ్జీవ కారాగార శిక్షపడింది.

లోకానికి కళ్ళులేవు, న్యాయానికంతకన్నా కళ్లు లేవు. కళ్ళున్న భగవంతుడు కూడ ఈ లోకానికి వచ్చి నిజం చెప్పటానికి భయపడుతున్నాడు.

నాగరాజు హాయిగానే ఉన్నాడు.

★

# అద్దము

(54 వ పేజీతరువాయి)

నద్దము దాల్చిన నాథుమోమునన్
ముద్దుబుగుల్కు మీసముల పొల్పుఁ
గనుంగొనుచున్ మృగీమదం
బద్దిన యంగుళీ కిసలయమునఁ
జెక్కుల పత్ర భంగముల్
దిద్దుకొనందొడంగె సుదతీమణి
నేరుపుమీర నవ్వుచున్

ముందరి కాలందే అనుకోండి ఈ కవిత అయినా ఆ భావ సౌందర్యానికి ఏమిలోటు!

నీడలు చూచుకుంటూ అలంకరించుకునే ప్రియురాలికి అద్దము పట్టుకొనే భాగ్యము ప్రియునిదై, పరస్పర ప్రేమ చూపులందుకొనే శృంగార కళాయుక్తి పరికరమైంది - అద్దము.

అలగ్జాండర్ డ్యూమాస్ రచించిన త్రీ మస్కటీర్స్ అనే నవలలో నాయకి లేడీ. డీ వింటర్ వద్ద ఒక వింత శక్తిగల అద్దము ఉండేదట. ఆవిడ, ఆ అద్దములో ప్రతి రోజూ. రోజుకి ఒక గంటసేపు తదేక ధ్యానంగా తన ప్రతిబింబం చూచుకుంటూ ఉండేదట. అందువల్ల, ఆమె ముఖం, ఎన్ని సంవత్సరాలు గడచినా, వాడకుండా, వయస్సు చెదరకుండా, నిత్యయవ్వనంతో నవనవలాడుతూ ఉండేదట.

అసలు జరిగిం దేమిటంటే. అది మామూలు అద్దమే. ఆవిడ ఆ అద్దములో, తన ముఖం చూచుకుంటూ ఆ ముఖం మీదనే మనస్సు నిలిపి, అల్లాగే చూస్తూ, అదే ధ్యానంతో నిబ్బరంగా ఉంటే, మనస్సులో నిలిచిన, తన అందమైన యవ్వన స్వరూపం లాగానే, తన ముఖం, చెక్కు చెదరకుండా ఉండేదని. కాలం ఎన్ని మార్పులు ముఖంలో తీసుకురావడానికి ప్రయత్నించినా తన మనస్సులో నాటుకుపోయిన ఆ అందమైన యవ్వన రూపంలోనే ముఖం నిల్చిపోతుందని దాని సూతన.

నిత్యమూ మన మనస్సుల్లో ఉండే దృఢమైన భావాలూ, భావ చిత్రాలూ మన రూపురేఖలని దిద్దుతాయని మన తత్వశాస్త్రజ్ఞులూ, వైద్యులూ కూడా చెబుతున్నారు.

శరీరదారుఢ్యము మానసిక పోషణకి ఎంత అవసరమో అంతకంటె ఎక్కువగా, మనోభావాల ప్రాబల్యం భౌతిక శరీరంమీద ఉంటుందన్నమాట రూఢి.

అందువల్లనే కాబోలు. పెద్దవాళ్ళు వంట్లో జబ్బుచేసినా, అమ్మవారు పోసినా, మానె రాచుకుంటున్నా, అద్దము చూచుకోడం నిషేధించారు. మనకి అప్పుడుండే దిగులువల్ల, అప్పటి అందవికారమైన ముఖమే మన మనస్సులో - మన భావప్రపంచంలో నిల్చిపోతుందనే భయం గాబోలు !

★